గోల్కొండ ఆసుపత్రి అభివృద్ధికి కృషి


ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్‌తో డాక్టర్ మజహర్ ఉల్లా తదితరులు

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రికి నిధులు కేటాయించి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గోల్కొండ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కూడా అయిన ఆయనను సోమవారం గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించారు. గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించాలని ఎమ్మెల్యేను కోరారు. గోల్కొండ ఏరియా ఆసుపత్రి పార్కింగ్ విషయం, ఆసుపత్రిలో ప్రతి నిత్యం పోలీస్ పెట్రోలింగ్, బల్దియా వారిచే ఆసుపత్రి వ్యర్థాలను తరలించేందుకు వాహనం ఏర్పాటు తదితర విషయాలు చర్చించి నిర్ణయం తీసుకోవాలని ఆయనను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఏఓ డాక్టర్ శ్రీనివాసరావు, ఆర్ఎంఓ డాక్టర్ వినాయక్‌రావు తదితరులున్నారు.

గోల్కొండ బోనాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తాం


వృత్తిపనివారి సంఘం సభ్యులతో ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఎస్.రాజువస్తాద్ తదితరులు

గోల్కొండ: వచ్చే నెల 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గోల్కొండ కోట బోనాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. సోమవారం గోల్కొండ కోటలో కొలువుదీరిన జగదాంబిక మహంకాళీ అమ్మవార్ల వృత్తిపనివార్ల సంఘం సభ్యులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోల్కొండ బోనాలకు దేశవ్యాప్తంగా గుర్తింపు ఉందని ఈ కోట బోనాల జాతర ఉత్సవాలకు లక్షలాదిగా భక్తులు తరలివస్తారన్నారు. దీనికి అనుగుణంగా పోలీసు బందోబస్తు సైతం భారీ స్థాయిలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు, వృత్తిపనివార్ల సంఘం అధ్యక్షుడు సాయిబాబాచారి, ప్రముఖ సంఘ సేవకుడు ఎస్.రాజువస్తాద్, బాబురావు, శ్రీకాంత్‌చారి, శివ పోతరాజ్, నర్సింగ్ రావు, వినోద్‌కుమార్, మహంకాళీ ఆలయ పూజారి సురేష్‌చారి తదితరులున్నారు.

బంగారు బోనం పూజలు ఘనంగా నిర్వహిస్తాం


గాజుల అంజయ్యను సన్మానిస్తున్న తిరుపతి నర్సింగ్‌రావు, విజయ్‌కుమార్ తదితరులు

చార్మినార్: బోనాల జాతర ఉత్సవాల్లో సప్త మాతృకలకు సప్త బంగారు బోనం కార్యక్రమంలో భాగంగా ఏడు అమ్మవారి ఆలయాలకు బంగారు పాత్రలో బోనంతో పాటు పట్టు వస్త్రాలను సమర్పించనున్నామని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. లాల్‌దర్వాజ సింహవాహినీ మహంకాళి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ తిరుపతి నర్సింగ్‌రావుతో పాటు అక్కన్న మాదన్న మహంకాళి ఆలయ కమిటీ కార్యదర్శి విజయ్‌కుమార్ తదితరులు సోమవారం ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా గాజుల అంజయ్య మాట్లాడుతూ.. ఈసారి బంగారు బోనం పూజా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నామన్నారు.

రోడ్డు కబ్జాలతో ట్రాఫిక్ సమస్యలు

మండిలో క్షేత్ర స్థాయి పరిశీలన చేసిన ట్రాఫిక్ పోలీసులు


దుకాణ దారులు కబ్జా చేసిన రోడ్డును పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ, గాజుల అంజయ్య

చార్మినార్: మీర్‌చౌక్ ట్రాఫిక్ ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి సోమవారం మీరాలంమండి ప్రధాన రోడ్డులో పర్యటించి ట్రాఫిక్ పరిస్థితిని పరిశీలించారు. మీరాలంమండి ఫుడ్ గ్రేన్స్ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు గాజుల అంజయ్యతో కలిసి పరిశీలించిన ఆయన ట్రాఫిక్ సమస్యలకు రోడ్డును సగం వరకు కబ్జా చేస్తున్న స్థానిక వ్యాపారులతోనే అనే విషయాలను తెలుసుకున్నారు. దుకాణాల ముందు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న వస్తువులను వెంటనే తొలగించాలని ఆయన స్థానిక వ్యాపారస్తులకు సూచించారు. మీరాలంమండి కూరగాయల మార్కెట్‌తో పాటు నిత్యావసర వస్తువుల క్రయవిక్రయాలు సైతం ఇక్కడ పెద్ద ఎత్తున కొనసాగుతాయని పాతబస్తీకి వెళ్లే రెండు రోడ్ల నడుమ ఈ మీరాలంమండి కూరగాయల మార్కెట్ ఏర్పడిందని గాజుల అంజయ్య ఎస్ఐకు వివరించారు. మదీనా నుంచి పాతబస్తీకి వచ్చే ప్రధాన రోడ్డులోని పత్తర్‌గట్టి రోడ్డు ద్వారా లోనికి వస్తే మీరాలంమండి కూరగాయల మార్కెట్ ఉంటుందన్నారు. అలాగే దారుషిఫా, పురానీహవేలి ప్రధాన రోడ్డు నుంచి లోనికి వస్తే కూడా మీరాలంమండి దారి కనిపిస్తుందని...ఇలా పాతబస్తీలోని రెండు ప్రధాన రోడ్లకు నడుమ మీరాలంమండి కూరగాయల మార్కెట్, ఫుడ్‌గ్రేన్ మార్చంట్ వ్యాపారాలు కొనసాగుతున్నాయన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి


వినతిపత్రం సమర్పిస్తున్న టీఎన్జీఓస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ తదితరులు

సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్యశాఖలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని టీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్‌ను కోరారు. ఈ మేరకు ఉద్యోగ సంఘ నాయకులతో కలిసి సోమవారం డీహెచ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్ మాట్లాడుతూ..హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అవసరాల మేరకు క్యాడర్ స్ట్రెంత్ లేకపోవడంతో ఉద్యోగులు అదనపు బాధ్యతలు నిర్వహించాల్సి వస్తుందన్నారు. డిపార్ట్‌మెంట్‌లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, ముఖ్యమంగా కంప్యూటర్ ఆపరేటర్లు ప్రతి సెక్షన్‌కు ఒకరు ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ నాయకులు కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ గౌడ్, రవిప్రకాష్, మామిడి ప్రభాకర్, హరి, చంద్రశేఖర్, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసిస్టులకు పదోన్నతులు కల్పించడం హర్షణీయం


డీహెచ్ రవీందర్‌నాయక్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ఫార్మసిస్టులు

సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్యశాఖలో 7వ జోన్‌లోని సీనియర్ ఫార్మసిస్టులకు ఫార్మసిస్ట్ గ్రేడ్–2 నుంచి గ్రేడ్–1గా ప్రభుత్వం పదోన్నతులు కల్పించడంపై తెలంగాణ ఫార్మసిస్ట్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సోమవారం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీందర్‌నాయక్ చేతులమీదుగా ఫార్మసిస్టులు పదోన్నతులు తీసుకున్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శరత్‌బాబు, అసోసియేట్ ప్రెసిడెంట్ జాలిగామ అశోక్ మాట్లాడుతూ..తమ సంఘం వినతి మేరకు ప్రభుత్వం ఫార్మసిస్టులకు పదోన్నతులు కల్పించడం తాము స్వాగతిస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోయిన పదోన్నతులు ప్రభుత్వం కోడ్ ముగిసిన వెంటనే ఇవ్వడం ఉద్యోగుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి తెలుస్తుందన్నారు. డీహెచ్ రవీందర్‌నాయక్ హామీ మేరకు తమకు పదోన్నతులు వచ్చాయన్నారు. తమ సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రేమ్‌సాగర్, ప్రకాష్‌రావ్, యాదయ్య, శ్రీధర్‌రెడ్డి, రాబర్ట్ బ్రూస్, రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, జయప్రకాష్, అలివేలు, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి సారూ..

- ప్రధాన రహదారిపై పొంగిపొర్లుతున్న మురుగు
- 8 ఏళ్లుగా ఇదే పరిస్థితి
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- ఎమ్మెల్యే ఆదేశాలు ఇచ్చినా పట్టించుకోని అధికారులు



లంగర్‌హౌస్ ప్రధాన రహదారిపై పొంగిపొర్లుతున్న మురుగు

లంగర్‌హౌస్: మురుగు నీటి ప్రవాహంతో అటు వాహనదారులు, పాదచారులు, ఇటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లంగర్‌హౌస్ ప్రధాన రహదారిపై దుర్గంధంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నా సంబంధిత అధికారులు మాత్రం తమకు పట్టనట్లుగా వ్యవహరించడంతో వాహనదారులు తీవ్రంగా మండి పడుతున్నారు.

లంగర్‌హౌస్ గాంధీ విగ్రహం చౌరస్తా నుంచి బాపూనగర్ పాత బస్‌స్టాప్ వరకు దాదాపు కిలో మీటరు దూరం వరకు దారి పొడవునా మురుగు నీరు నిత్యం ప్రవహిస్తుంది. పాదచారులకు నడవడానికి ఇబ్బందిగా మారగా, వాహనదారులపై మురుగు పడుతుంది. మంచి నీటి నల్లాల్లో కూడా మురుగు చేరుతుంది.

గత ఎనిమిది సంవత్సరాలుగా..

లంగర్‌హౌస్ ప్రధాన రహదారిపై మురుగు నీరు పొంగి పొర్లడం స్థానికులకు చరామామూలుగా మారింది. ఈ దారి పొడవునా చౌరస్తా వద్ద, సినిమా థియేటర్ ముందు పక్కన నాలుగు ప్రాంతాల్లో నిత్యం మురుగు నీరు పొంగుతుంది. ఎనిమిది సంవత్సరాలుగా మురుగు పొంగుతుండగా అప్పుడప్పుడు తూతుమంత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. గత నాలుగు నెలలుగా మాత్రం ఇక్కడ మురుగు పరుగు ఆగడం లేదు. ఈ మురుగు నీరు తాగునీటి సరఫరా పైపులలోకి చేరడంతో కొలాయిల్లో మురుగునీరు వస్తుంది.

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతర్..

లంగర్‌హౌస్ ప్రధాన రహదారిపై నెలకొన్న దుర్గంధ పరిస్థితులను పరిష్కరించాలంటూ మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. వెంటనే అధికారులకు ఎమ్మెల్యే ఫోన్ చేసి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. అయితే సంబంధిత అధికారులు మాత్రం మూడు రోజులు గడుస్తున్నా ఎలాంటి మరమ్మతులు ప్రారంభించకపోవడంతో అధికారులపై ప్రజలు మండిపడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఇక్కడ శాశ్వత పరిష్కారం చేయాలన్నారు.

మేరు కులస్తులకు నామినేటెడ్ పోస్టులు కేటాయించాలి


మంత్రి కొండ సురేఖకు మెమోరాండం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: మేరు కులస్తులకు నామినేటెడ్ పోస్టులు కేటాయించాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. పదేళ్లు మేరు, దర్జీ, టైలర్ కులస్తులకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం ఎలాంటి న్యాయం చేయలేదన్నారు. 33 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉన్న తనకు నామినేటెడ్ పోస్టు ఇవ్వాలని రాష్ట్ర మంత్రి కొండ సురేఖకు ఆయన మెమోరాండం అందజేశారు. అనంతరం పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..33 ఏళ్లుగా కాంగ్రెస్ జెండాలను మోస్తున్న మేరు కులస్తులకు ఇంతవరకు ఏ ఒక్క నామినేటెడ్ పోస్టు ఇవ్వలేదన్నారు. ఈ సందర్భంగా కొండ సురేఖ సానుకూలంగా స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి మేరు కులస్తుల డిమాండ్ల తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పోల్కం వినయ్‌రాజ్, శివకుమార్, నవీన్‌కుమార్, ఆదిమూలం శంకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని కాలనీలనూ అభివృద్ధి చేస్తానని కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. శ్రీ వెంకటేశ్వ కాలనీ సభ్యులు నూతన మేయర్ లతాప్రేమ్‌గౌడ్‌ను సోమవారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ వెంకటేశ్వర కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని, కరెంటు, మంచినీటి, డ్రైనేజీ సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని లతా హామీ ఇచ్చారు.

అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన స్థానిక కార్పొరేటర్లు, జీహెచ్ఎంసీ, ప్రాజెక్టు, ఇంజినీరింగ్, జలమండలి అధికారులతో కలిసి నియోజకవర్గంలోని తలాబ్‌కట్టా, భవానీనగర్, యాకుత్‌పురా నాలా, మౌలాకా చిల్లా, ముర్తుజానగర్, గంగానగర్ నాలా, రెయిన్‌బజార్, మదీనానగర్ పరిసరా ప్రాంతాల్లో పర్యటించారు. ఇప్పటికే ప్రతిపాదించి చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వర్షా కాలం నేపథ్యంలో వరద నీటి సమస్యలు రాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో రెయిన్‌బజార్, పత్తర్‌గట్టీ డివిజన్ల కార్పొరేటర్లు మహ్మద్ వసీవుద్దీన్, సయ్యద్ సోహెల్ ఖాద్రీ, జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ ప్రాజెక్ట్స్ ఎస్ఈ దత్తుపంతు, జలమండలి జీఎంలు నాగేందర్, వినోద్ భార్గవ్, జీహెచ్ఎంసీ ఈఈలు కిరణ్, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేస్తాం



వివిధ పతకాలు సాధించిన క్రీడాకారులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా శిక్షణ ఇస్తున్నామని తెలంగాణ ఏయిర్ గన్ అసోసియేషన్ సెక్రెటరీ, కోచ్ డాక్టర్ పి.భువనేశ్వరీ అన్నారు. ఏయిర్ గన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా 10వ జాతీయ రైఫిల్, పిస్టల్ షూటింగ్ పోటీలను గోవాలో నిర్వహించారు. ఈ పోటీలకు 12 రాష్ట్రాలకు చెందిన 180 మంది పాల్గొనగా తెలంగాణ నుంచి 13 మంది వివిధ విభాగాల్లో పాల్గొని 27 పథకాలను సాధించారని కోచ్ భువనేశ్వరీ వెల్లడించారు. రానున్న పోటీల్లో యువ క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా తీసుకువస్తామని తెలిపారు.

బీజేపీ నాయకుల సంబరాలు


సంబరాల్లో బీజేపీ కార్వాన్ ఇన్‌చార్జి అమర్‌సింగ్ తదితరులు


సంబరాల్లో ఓబీసీ నాయకులు ఆనంద్‌గౌడ్, ఉదయ్‌కుమార్

గోల్కొండ: భారత ప్రధానిగా మూడోసారి నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బీజేపీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. సోమవారం గుడిమల్కాపూర్ చౌరస్తా వద్ద బీజేపీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలు టపాసులు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. అమర్‌సింగ్ మాట్లాడుతూ..దేశంలో బీజేపీకి తిరుగే లేదని అన్నారు. తన పదేళ్ల పాలనలో ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని అగ్రరాజ్యంగా తీర్చిదిద్దారని అందువల్లే దేశ ప్రజలు ఆయనను మరోసారి గెలిపించారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షులు జి.సునీల్‌యాదవ్ తదితరులున్నారు. అదే విధంగా ప్రధాని నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకొని టోలిచౌకీ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి ఆధ్వర్యంలో గోల్కొండ రిసాలబజార్‌లో సంబరాలు నిర్వహించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు విక్కీ తదితరులున్నారు.

మంత్రి పదవుల్లో సముచిత స్థానం సంతోషకరం..

లంగర్‌హౌస్: కేంద్ర మంత్రి వర్గంలో ఓబీసీలకు పెద్దపీట వేయడంతో పాటు అందరికీ సముచిత న్యాయం ప్రధాని మోదీ చేయడం చాలా సంతోషకరమని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. మంత్రి వర్గ విస్తరణలో అందరికీ న్యాయం జరిగిందంటూ సోమవారం ఆయన ఆధ్వర్యంలో మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 27 మంది ఓబీసీలతో పాటు 20 మంది ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు, ప్రతి రాష్ట్రానికి కేంద్ర మంత్రి పదవి ఇచ్చి అందరికీ సముచిత న్యాయం చేశారన్నారు. ఈ సంబరాల్లో గోల్కొండ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, కట్టా నర్సింగ్ రావు, వెంకటేష్ ప్రభు పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్రమోదీతోనే దేశం సుభిక్షం..

సుల్తాన్‌బజార్: దేశంలో ప్రధానిగా మూడోసారి ప్రమాణస్వీకారం చేసిన నరేంద్రమోదీ చిత్రపటానికి జాంబాగ్ బీజేపీ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ పాలాభిషేకం చేశారు. సోమవారం గౌలిగూడలో రాకేష్‌జైస్వాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేసి ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. రాకేష్ జైస్వాల్ మాట్లాడుతూ..దేశంలోని ప్రజలు నరేంద్ర మోదీయే ప్రధానమంత్రి కావాలని ఆకాంక్షించి మూడోసారి ఆయనను దేశ రథసారథిగా నిలబెట్టారన్నారు. నాయకులు శ్రీనివాస్‌యాదవ్, అమర్‌సింగ్, అనిల్‌యాదవ్, రవి, కాజల్, నర్సింగ్, రామకృష్ణ పాల్గొన్నారు.


ప్రధాని నరేంద్రమోదీ చిత్రానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు రాకేష్ జైస్వాల్ తదితరులు

బీజేపీతోనే దేశాభివృద్ధి

అబిడ్స్: బీజేపీ ప్రభుత్వంతోనే దేశం అన్ని రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందుతుందని గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్ పేర్కొన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం మరోసారి ఏర్పాటు కావడంతో గోషామహల్‌లో ఆయన సంబరాలు నిర్వహించారు. కార్యకర్తల సమావేశం నిర్వహించి పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం లాల్‌సింగ్ మాట్లాడుతూ..ప్రపంచంలోనే భారత్ అన్నిరంగాల్లో నెంబర్:1 స్థాయిలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నట్రాజ్ నాందారి తదితరులు పాల్గొన్నారు.


వేడుకల్లో కార్పొరేటర్ లాల్‌సింగ్ తదితరులు

బండి సంజయ్‌కు శుభాకాంక్షలు



గౌలిపురా: కేంద్రమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బండి సంజయ్‌ని ఢిల్లీలోని ఆయన నివాసంలో యువ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ పార్లమెంటు ప్రబారి ఎ.శివచంద్రగిరి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు పొన్న వెంకటరమణ కలిసి శుభాకాంక్షలు తెలిపారు

ఆకట్టుకున్న అన్నమాచార్య సంకీర్తనలు


రచయిత్రులతో ఎంకె.రాములు తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో లేఖిని రచయిత్రుల వేదిక, సరసిజ థియేటర్‌ల ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతిలో అన్నమాచార్య 616వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గాయనీ గాయకులు ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రముఖ కళాకారిణి ఈమని కల్యాణికి పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రసమయి సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ ఎంకె.రాము, గేయ రచయిత కె.కృష్ణమోహన్, లేఖిని రచయిత్రుల వేదిక అధ్యక్షురాలు అత్తలూరి విజయలక్ష్మి, గౌరీలక్ష్మి, డాక్టర్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బుర్రా వెంకటేశం తదితరులు

గన్‌ఫౌండ్రీ: మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు భారతరత్న పురస్కారం వచ్చిన సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ పీవీ సాహిత్యంపై 'పునాస' ప్రత్యేక సంచికను తీసుకువచ్చారు. ఈ మేరకు సోమవారం రవీంద్రభారతిలోని సాహిత్య అకాడమీ కార్యాలయంలో ప్రత్యేక సంచికను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవీ నర్సింహారావు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్.బాలచారి, రాప్రోలు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు కార్యాలయ ప్రాంగణంలో ఆటోల తిష్ట


వార్డు కార్యాలయ ప్రాంగణంలో ఆటోలు

గోల్కొండ: గోల్కొండ బల్దియా వార్డు కార్యాలయం సాయంత్రం కాగానే ఆటోవాలాల అడ్డాగా మారుతుంది. గోల్కొండ కోట చౌరస్తాకు ఎదురుగా ఉన్న ఈ వార్డు కార్యాలయం ఎప్పుడూ తెరుచుకోని ఉంటుంది. కార్యాలయం ముగిసిన తర్వాత కూడా గేటుకు తాళం వేయరు. దీనిని సాకుగా చేసుకోని కొందరు వ్యక్తులు సాయంత్రం 7 గంటలు కాగానే కార్యాలయ ప్రాంగణంలోకి వస్తున్నారు. పలువురు ఆటోవాలాలు సైతం ఇష్టారాజ్యంగా తెరిచి ఉన్న గేటులోకి ఆటోలు తెచ్చి తిష్ట వేస్తున్నారు. అసలు సిబ్బంది గేటుకు ఎందుకు తాళం వేయరని మరికొందరు ప్రశ్నిస్తున్నారు.

అన్నదానం


కేన్సర్ ఆసుపత్రి వద్ద అన్నదానం చేస్తున్న మహ్మద్ బషీర్ తదితరులు

గోల్కొండ: ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద తమ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అన్నదాన కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తామని గోల్కొండ సెకండ్ లాన్సర్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీర్ అన్నారు. సోమవారం ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి వద్ద ఆయన ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రులకు గ్రామీణ ప్రాంతాల నుంచి పేద వారే ఎక్కువగా వస్తారని అటువంటి వారికి రోజు ఒకపూట భోజనం అందిస్తున్నామన్నారు.

ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


స్టేట్ ఫైనాన్షియల్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్‌రాజు

అబిడ్స్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ బేగంపేట్ ఏసీపీ జి.శంకర్‌రాజు పేర్కొన్నారు. సోమవారం అబిడ్స్‌లోని స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ సిబ్బందికి, అధికారులకు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ..వర్షాకాలంలో ప్రయాణంలో పలు ప్రమాదాలు పొంచి ఉన్నాయన్నారు. సాధారణ రోజులతో పోలిస్తే వర్షాకాలంలోనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కొంతమంది ప్రైవేటు బస్సులు, ఆటోలు, కార్లు కూడా రాంగ్‌రూట్‌లో వెళ్లడం ద్వారా తరచు ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఏసీపీ శంకర్‌రాజు వివరించారు. డ్రైవింగ్‌లైసెన్స్ కూడా లేకుండా వాహనాలు నడిపితే చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 200 మంది సిబ్బంది, అధికారులకు అవగాహన చేపట్టారు. ఈడీ ఎం.శ్రీనివాస్, పద్మాకర్‌రావు, పాండురంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీ అభివృద్ధికి మజ్లిస్ పార్టీ నిరంతర కృషి


శుభాకాంక్షలు తెలియజేస్తున్న హస్మత్ అలీ తదితరులు

చార్మినార్: పాతబస్తీ అభివృద్ధికి మజ్లిస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని మజ్లిస్ పార్టీ నాయకుడు హస్మత్ అలీ అన్నారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఘన విజయం సాధించడంతో మజ్లిస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సోమవారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ ఆధ్వర్యంలో ఇటీవల బీజేపీ నుంచి ఎంఐఎం పార్టీలోకి మారిన చార్మినార్‌కు చెందిన హస్మత్ అలీ తదితరులు ఎంపీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పాతబస్తీలో అన్ని వర్గాల సంక్షేమం మజ్లిస్‌కే సాధ్యమని..అందుకే బీజేపీ వదిలి మజ్లిస్ పార్టీలో చేరినట్లు ఆయన వెల్లడించారు.